వేములవాడ కంపు కంపు

● శివారు కాలనీలు అస్తవ్యస్తం ● డ్రైనేజీలు లేక ఇండ్ల పక్కనే నిలుస్తున్న మురుగు నీరు ● కుంటలను తలపిస్తున్న పరిసరాలు ● ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు.. ప్రజల అవస్థలు ● పట్టించుకోని అధికారులు

వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు సత్రం వెనకాల కాలనీలో ఇండ్ల మధ్యలో నిలిచిన మురుగునీరు

వేములవాడ పట్టణం కంపు కొడుతున్నది. అస్తవ్యస్త పాలన, అధ్వానపు డ్రైనేజీలతో మురుగు పేరుకుపోతున్నది. ముఖ్యంగా శివారు కాలనీల్లో డ్రైనేజీలు లేక.. నీరు బయటికి వెళ్లే అవకాశం లేక ఇండ్ల పక్కనే మురుగు నిలిచిపోతూ, కుంటలను తలపిస్తున్నది. ప్రధానంగా కోనాయిపల్లి రూట్‌లోని సాయినగర్, మొదటి బైపాస్ రోడ్‌లోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రం వెనకాల కాలనీలో ఏ వీధికెళ్లినా చెడు వాసనే వస్తుండగా, ప్రజానీకం నరకం చూస్తున్నది. మరోవైపు వ్యాధులు ప్రబలుతుండగా, అల్లాడిపోతున్నది. అధికారులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేసే విధానం బాగున్నప్పటికీ, డ్రైనేజీల సమస్యను విస్మరించడం సరికాదని, వెంటనే స్పందించాలని కోరుతున్నది.

– వేములవాడ, జూన్ 9

వేములవాడ పట్టణం శివారు సమస్యల వలయంలో చిక్కుకున్నది. ముఖ్యంగా డ్రైనేజీల సమస్య వేధిస్తున్నది. విస్తరిస్తున్న కాలనీలకు అనుగుణంగా మౌళిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నది. అధికారులకు ఎన్నిసార్లు విన్న వించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నది. ముఖ్యంగా వేములవాడ పట్టణంలోని మొదటి బైపాస్ రహదారి మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రం వెనకాల కాలనీని మురుగు నీటి బాధ పట్టి పీడిస్తున్నది. జాతర గ్రౌండ్ నుంచి మురుగు నీరు మొత్తం ఇక్కడికే వచ్చి ఇళ్ల మధ్యలోనే నిలి చిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు కోరుట్ల బస్టాండ్ నుంచి కోనాయిపల్లి వెళ్లే రహదారి లోని సాయినగర్‌లోనూ ఇదే దుస్థితి నెలకొన్నది. డ్రైనేజీలు నిర్మించకపోవడమే ఇందుకు కారణంగా కాగా, ఇండ్ల పరి సరాలు కుంటలను తలపిస్తున్నాయి. అయితే మురుగు నీటిని కాలువలోకి తరలించే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన కాదు.. మురుగు బాధ తీర్చాలి

శివారు కాలనీల పరిస్థితి అధ్వానంగా మారింది. మురుగు కాలువలు పూర్తికాకపోవడంతో ఖాళీ స్థలాల్లోకి నీరు చేరి చెరువులు, కుంటల్లా మారి కంపుకొడుతున్నాయి. ఫలితంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతుండగా, ప్రజలు అల్లాడిపోతున్నారు. అయితే సీజనల్ వ్యాధుల పట్ల అప్ర మత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ విభాగం సిబ్బంది ఇప్పటికే పది రోజులపాటు ప్రత్యేక అవ గాహన కార్యక్రమాలు నిర్వహించారు. అయితే ఖాళీ స్థలాలు, చుట్టుపక్కల పరిసరాల్లో నీటి నిల్వలు ఉండ కుండా జాగ్రత్త పడాలని సూచించగా, శివారు కాలనీ ప్రజలు మండిపడుతున్నారు. అవగాహన కల్పిస్తే సరిపో దని, తమ మురుగు నీటి బాధను తీర్చితేనే వ్యాధుల బారిన పడకుండా ఉంటామని అంటున్నారు.

కోరుట్ల వెళ్లే రోడ్డులోని సాయినగర్ కాలనీలో ఇండ్ల మధ్యలో మురుగు కుంట

మా ఇంటి పక్కనే మురుగు నీరు కుంటలా ఉంది..

కోరుట్ల రోడ్డులోని సాయినగర్ కాలనీలో డ్రైనేజీల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. పై నుంచి వచ్చే మురుగు నీరు ఖాళీ స్థలాల్లోకి చేరి పెద్ద కుంటగా మారింది. ఏడాదంతా ఇందులో నీరు నిలువ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. పక్కన ఉన్న కాలువలోకి నీటిని మళ్లించే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటు వైపు కన్నెత్తిచూడడం లేదు.

- ఎల్లవ్వ, సాయినగర్, వేములవాడ

అధికారులు పట్టించుకుంట లేరు..

రాజన్న ఆలయ సమీపంలోని జాతర గ్రౌండ్‌లోని మురుగు నీరు మొత్తం మా కాలనీలోకి వచ్చి చేరుతుంది. ఏడాదంతా ఇండ్ల మధ్యలోనే నిలిచిపోతుంది. ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకుంటలేరు. మురుగు నీటి బాధతో కనీసం అద్దెకు కూడా ఎవరూ రావడం లేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- రాకేశ్ రావు, మున్నూరు కాపు సత్రం వెనుకగల కాలనీ, వేములవాడ

సేంద్రియ సేద్యంతోనే అధిక దిగుబడి

గంభీరావుపేట, జూన్ 9: సాగులో రసాయనిక ఎరువులు వాడొ ద్దని, సేంద్రియ పద్ధతులతోనే అధిక దిగుబడి సాధ్యమవుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో క్లస్టర్ పరిధిలోని రైతులకు వానకాలం పంటల సాగు విధానంపై జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యా లయం, బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల, జమ్మికుంట, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్య క్రమంలో అరుణ్‌బాబు, ప్రియదర్శిని, ప్రభాకర్, మహేశ్, మండల వ్యవసాయాధికారి సలావుద్దిన్, ఉద్యానవన అధికారి లోకేష్, వ్యవ సాయ విస్తీర్ణ అధికారులు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

ముస్తాబాద్, జూన్ 9: అనుమతిలేకుండా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని మైనింగ్ అధికారులు పేర్కొన్నారు. పోతుగల్ శివారులోని పట్టా భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తు న్నారని సమాచారం మేరకు సోమవారం మైనింగ్ అధికారులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది వెళ్లి పరిశీలించారు. మట్టిని ఎంత మేరకు తొలగించారు..?, ఎటు తరలించారనే విషయాలపై విచా రణ చేపట్టారు. మట్టి తొలగించేందుకు ఉపయోగించిన వాహనా లను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఛత్రపతి శివాజీకి నివాళి

వేములవాడ రూరల్, జూన్ 9: జయవరం గ్రామంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ పట్టాభిషేక దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరం గదళ్ సభ్యులు గడప కిశోర్‌రావు, నాగుల రాము, మోటూరి మధు, గౌరిశెట్టి శ్రీనివాస్, బూర తేజగౌడ్, బాలు పాల్గొన్నారు.

పర్మిషన్ లేని స్కూళ్లపై చర్యలు తీసుకోండి

వేములవాడ రూరల్, జూన్ 9: వేములవాడ పట్టణంలో అను మతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల మహేందర్ ఆధ్వర్యంలో ఎంఈవో బన్నాజీకి సోమవారం వినతి పత్రం అందజేశారు. మహేందర్ మాట్లాడుతూ వేములవాడలో అనుమతి పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, నిర్వాహకులపై చర్యలు తీసు కోవాలని కోరారు. ఇక్కడ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కరుణాకర్, పార్వతి మహేశ్, గవాస్కర్ ఉన్నారు.

బొప్పాపూర్‌లో ఇంటింటి సర్వే

ఎల్లారెడ్డిపేట, జూన్ 9: విషజ్వరం బారిన పడి బొప్పాపూర్‌కు చెందిన మోతుకు హిమాన్షి ఆదివారం మృతి చెందగా, వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. ప్రతి ఇంటిని సర్వే చేయాలనే ఉద్దే శంతో ఆరు బృందాలుగా రంగంలోకి దిగారు. ఒక్కో బృందంలో ఇద్దరు ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు సర్వేలో పాల్గొ న్నట్లు సిబ్బంది తెలిపారు. కాగా, గ్రామంలో పారిశుధ్యం లోపిం చిందని, భగీరథ నీరు రంగుమారి వస్తున్నట్లు ఫిర్యాదులు అందా యని, దీంతో ప్రజలు చర్మ సంబంధిత సమస్యలు ఎదుర్కొంటు న్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. రానున్న వర్షాల నేప థ్యంలో పారిశుధ్య నిర్వహణ లోపిస్తే విషజ్వరాలు ప్రబలే ప్రమా దముందన్నారు. అయినప్పటికీ పారిశుధ్య నిర్వహణపై కాలనీవా సులకు తమవంతు అవగాహన కల్పించామని చెప్పారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్ 9: యాక్సిడెంట్ చేశాడని, అనుచితంగా ప్రవర్తించాడనే నెపంతో ఓ వ్యక్తిపై విచక్షణారహితంగా దాడి చేసిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. బాధితుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. దుమాలకు చెందిన పాముల సతీశ్ తన పికప్ వాహ నంతో నిజామాబాద్‌కు చెందిన గిరిధర్‌రెడ్డి నడుపుతున్న కారును ఢీకొట్టగా, అటుగా వెళ్తున్న కొందరు వ్యక్తులు సతీశ్‌తో గొడవ పడ్డా రు. గొంతునులిమి, చితక బాదారు. సతీశ్‌ను చికిత్స కోసం వరం గల్ ఎంజీఎంకు తరలించగా, రెండు రోజులు అపస్మారక స్థితిలో ఉన్నాడు. తాజాగా స్పృహ వచ్చినప్పటికీ నోటిమాట రావడం లేదని బాధితుడి తండ్రి అంజయ్య తెలిపాడు. తాను చిన్న హోటల్ నడుపుకుని కుటుంబాన్ని నడుపుకుంటున్నానని, గతంలో తన పెద్ద కొడుకు అనారోగ్యంతో చనిపోగా ప్రస్తుతం చిన్న కొడుకు పరిస్థితిని చూడలేక పోతున్నానని ఆవేదనగా తెలిపాడు. తన కొడుకు తప్పు చేస్తే చట్టప్రకారం ఏ శిక్ష వేసినా ఒప్పుకుంటానని, కానీ ఇలా ఇష్టా రాజ్యంగా దాడి చేయడం సరికాదని, సదరు వ్యక్తులను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరాడు. దీనిపై ఎస్ఐ రమాకాంత్‌ను వివ రణ కోరగా దాడి సమయంలో తీసిన కొన్ని వీడియోలు వచ్చాయని ఇప్పటికే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పాడు.

వంతెన నిర్మాణం చేపట్టాలి

వీర్నపల్లి, జూన్ 9: అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని అడవిపదిర గ్రామస్తులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ హయాంలో వంతెన నిర్మాణానికి అప్పటి మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రూ.2.27కోట్లు మంజూరు చేశారని చెప్పారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు వేగవంతం చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని మండిపడ్డారు. పాత వంతెన కూల్చేసి తాత్కాలికంగా మట్టిరోడ్డు ఏర్పాటు చేశాడని, వా నకాలం సమీపిస్తుండడంతో వాగు ఉధృతికి రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని, గ్రామస్తులు మూడు కిలోమీటర్ల అదనంగా తిరగాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పారు. ఈ క్రమంలో పనులు వెంటనే ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్, నాయకులు శ్రీనివాస్, నరేశ్, తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

తిరుపతి(ఫైల్)

కోనరావుపేట, జూన్ 9: అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసు కున్న ఘటన కోనరావుపేట మండలం ధర్మా రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అన్నవేణి తిరుపతి (36) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. మద్యానికి బానిసై ఆర్థికంగా ఇబ్బంది పడుతూ అప్పుల పాలయ్యాడు. ఈ నెల 5న అతిగా మద్యం తాగి ఇంటికి రావడం, భార్య ప్రశ్నించడంతో ఇంట్లో ఉన్న గండి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఎల్లారెడ్డిపేటలోని హాస్పి టల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. తిరుపతికి భార్య లతిక, కుమారుడు శ్రీమాన్ ఉన్నాడు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

వేములవాడ/ బోయినపల్లిరూరల్, జూన్ 9: వేములవాడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధి కారి స్వప్న సోమవారం ప్రకటనలో తెలిపారు. సీఈసీ, ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ కోర్సులలో 2025–26 విద్యా సంవత్సరంలో బోధించేందుకు ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకో వాలన్నారు. అలాగే బోయినపల్లి కస్తూర్బాలో ఇంటర్మీడియట్ బైపీసీ, మెడికల్ లేబరేటరీ టెక్నాలజీ ఆంగ్ల మాధ్యమంలో బోధ నకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్పెషలాఫీసర్ లింగవ్వ ఒక ప్రకటనలో తెలిపారు. పై పోస్టులకు పీజీలో ఎంఏ, ఎంకామ్, బీఈడీ, బిఈ, బీటెక్, ఏఎంఐఈ అర్హతగల వారు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా విద్యార్హతల జిరాక్స్ పత్రాలతో ఆ యా విద్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు.

మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ● మహిళా సంఘాల కృతజ్ఞత సభకు హాజరు

మహిళా సంఘం సభ్యులను సన్మానిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్, జూన్ 9: మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొ న్నారు. ఈ యాసంగి సీజన్‌కు సంబంధించి తమకు 190 ధాన్యం కొనుగోలు కేంద్రాలు కేటాయించినందుకు గాను మహిళా సంఘాల సభ్యులు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత, సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సెంటర్లు విజ యవంతంగా నిర్వహించిన మహిళా సంఘాల సభ్యులను అభినందిం చారు. ముందుగా కలెక్టర్‌ను మహిళా సంఘాల సభ్యులు సన్మానిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో 42 కొనుగోలు కేంద్రాల మాత్రమే మహిళా సంఘాల నిర్వహించేవారని, తాను కలెక్ట ర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత యాసంగి సీజన్‌లో అత్యధికంగా 190 సెంటర్ల నిర్వహణ బాధ్యతలను అప్పగించానని, చాలా మంది అంచనాలు తలదన్నేలా విజయవంతంగా కొనుగోలు ప్రక్రియ చేపట్టా రని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కింద మహిళలను కోటీశ్వరులను చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను సంఘాలకు అప్పగించామని వివరించారు. యాసంగి సీజన్‌లో మహి ళలకు వచ్చిన దాదాపు రూ.7 కోట్ల కార్పస్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం వివిధ సమస్యలపై కలె క్టరేట్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం ఆవరణలో శ్రీ రాజరాజేశ్వర మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన జిరాక్స్ సెంటర్‌ను కలెక్టర్ ప్రారంభిం చారు. ఇక్కడ డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రజిత, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలి బేగం, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

ప్రజావాణిలో వచ్చే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలె క్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజల నుంచి దర ఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు 51, హౌసింగ్ 32, ఏడీ ఎస్ ఎల్ ఏ, డీఈఓకు 7 చొప్పున, డీఆర్డీవోకు 6, జిల్లా సంక్షేమ అధికారి 5, జిల్లా పౌరసరఫరాల అధికారి, ఎస్సీ కార్పొరేషన్, ఉపాధి కల్పన శాఖకు మూడు చొప్పున, సిరిసిల్ల మున్సిపల్, ఎంపీడీఓ బోయినపల్లికి రెండు చొప్పున ఎస్పీ, ఎస్డీసీ, నీటి పారుదల శాఖ, సెస్, ఎక్సైజ్ శాఖ, మిషన్ భగీరథ, ఎల్డీఎం, ఏడీ హ్యాండ్‌లూమ్స్, సీపీఓకి ఒకటి చొప్పున మొత్తం 134 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావా ణిలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ శేషాద్రి, ఆయా శాఖల ఉన్న తాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ● ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ ● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రుద్రంగి/చందుర్తి, జూన్ 9: ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం రుద్రంగి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అధికారులతో కలిసి భూమిపూజ చేసి, మాట్లాడారు. ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించుకోవాలని, దశల వారీగా నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం 10 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత, ఏఓ ప్రియదర్శిని, నాయకు లు తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్, గండి నారాయణ, సూర యాదయ్య, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాధర్, లచ్చిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో 89 మంది లబ్ధిదారులకు 29 లక్షల 33 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఇక్కడ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, మాజీ సర్పంచ్ ఏసుదాస్ నాయకులు ఉన్నారు.



రుద్రంగి: సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, జూన్ 9: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 56మంది లబ్ధిదారులకు రూ.18లక్షల 37వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఇక్కడ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, పార్టీ మండలాధ్యక్షుడు పాషా, జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్, వైస్ చైర్మన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఊరూరా బడిబాట

● గ్రామాల్లో డప్పుచప్పుళ్ల మధ్య ర్యాలీలు, ప్రచారం ● పాల్గొంటున్న ఎంఈవోలు, హెచ్ఎంలు

సిరిసిల్ల రూరల్, జూన్ 9: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల ప్రవేశాలే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా బడిబాట కార్యక్రమం కొనసాగుతున్నది. సోమవారం ఆయా గ్రామాల్లో పర్యటించిన హెచ్ఎంలు, టీచర్లు ఇంటింటికీ తిరిగి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సోమ వారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు, బాబాజీనగర్‌లలో సిరి సిల్ల ఎంఈవో దూస రఘుపతి, హెచ్ఎంలు, టీచర్లతో కలిసి బడి బాట ర్యాలీ తీసి, ఇంటింటాప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విలువలో కూడిన ఒత్తిడి లేని విద్యాబోధన ఉంటుందని, నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందం బోధనతో ఉత్తమ ఫలి తాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం కరపత్రాలను ఆవి ష్కరించారు. కార్యక్రమాల్లో కాంప్లెక్స్ హెచ్ఎం మోతిలాల్, హెచ్ఎంలు చక్రవర్తుల రమాదేవి, గడ్డం శంకర్, మాజీ కౌన్సిలర్లు చెన్నమనేని కీర్తి కమలాకర్‌రావు, లింగంపల్లి సత్యనారాయణ, తమ్మటి జీవన్,సుధా మోటం జైపాల్, కల్లెం మహిపాల్, ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, అజయ్, చంద్రశేఖర్, తిరుపతి, మాధవి, వాణిశ్రీ, కల్పన, వీణ,శంకర్, రాజమల్లు, రవికుమార్, అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, మాధవి, ఆశవర్కర్ లావణ్య, జ్యోతి సీఆర్పీ సత్యకుమారి, గంగయ్య, బత్తిని పద్మ, తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట, జూన్ 9: కందికట్కూర్‌లో గ్రామంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ బడిబాట నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి ప్రచారం చేశారు. విద్యా ర్థుల తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించా లని, కార్పొరేట్‌కు దీటుగా బోధన జరుగుతుందని వివరించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ అమర్, నాయకులు బిగుళ్ల క్రిష్ణ, విజయ్, తిరుపతి తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



ఇల్లంతకుంట: కందికట్కూర్‌లో ప్రచారం చేస్తున్న ఎంఈవో, టీచర్లు

అనుపురంలో బడిబాట

వేములవాడ రూరల్, జూన్ 9: అనుపురం గ్రామంలో సోమవారం బడిబాట, అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విఠల్ ఆధ్వర్యంలో ఉపాధ్యా యులు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. అచ్చన్నపల్లి గ్రామంలో జరిగిన బడిబాట కార్యక్రమంలో ఎంఈవో కిషన్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

● సిరిసిల్లకు చెందిన బాలిక మృతి, తండ్రి, సోదరుడికి తీవ్రగాయాలు

సిరిసిల్ల టౌన్, జూన్ 9: హైదరాబాద్‌లో జరి గిన రోడ్డు ప్రమాదంలో 12ఏండ్ల బాలిక మృతి చెందడం, తండ్రి, సోదరుడికి తీవ్రగాయాలైన ఘటన సిరిసిల్లలో విషాదాన్ని నింపింది. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్ట ణానికి చెందిన దేవత భిక్షపతి–ప్రసన్న దంపతు లకు కొడుకు సాకేత్, కూతురు శ్రీవైష్ణవి(12) ఉన్నారు. భిక్షపతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కావడంతో కుటుంబంతో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. కరీం నగర్‌లోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి సోమవారం వచ్చారు. సాయంత్రం తల్లి ప్రసన్న ఇక్కడే బంధువుల ఇంట్లోనే ఉండిపోగా, భిక్షపతి తన కొడుకు, కూతురుని తీసుకుని హైదరాబాద్ ప్రయాణమయ్యాడు. ఉప్పల్ ప్రాంతానికి చేరు కోగానే రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్ లారీని కారు ఢీనగా, వైష్ణవి అక్కడికక్కడే మృతి చెందింది. భిక్షపతికి తీవ్రగా యాలు కాగా, కొడుకు సాకేత్ చేయి విరిగింది. వీరి ద్దరూ ప్రస్తుతం హైదరాబాద్ లోని కాంటినెంటల్ హాస్పిట ల్‌లో చికిత్స పొందుతున్నారు. వైష్ణవి మృతితో సిరిసిల్లలో విషాదచాయలు అలుముకున్నాయి. సిరిసిల్లలోని ప్రగతినగర్‌లో అంత్యక్రియలు నిర్వ హించగా, శ్రీవైష్ణవి మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు రోదించిన తీరు స్థానికులకు కంటనీరు పెట్టించింది.

శ్రీ వైష్ణవి(ఫైల్)

సిరిసిల్లలో ఎస్‌బీఐ లైఫ్ సేవలు

సిరిసిల్ల రూరల్, జూన్ 9: సిరిసిల్ల కార్మిక క్షేత్రంలో స్టేట్ బ్యాంక్ ఇండియా లైఫ్ (జీవిత బీమా) సేవలు అందిస్తున్నామని ఎస్‌బీఐ లైఫ్ సిరి సిల్ల బ్రాంచి మేనేజర్ ప్రభాకర్ తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటలో ఎస్‌బీఐ లైఫ్ సిరిసిల్ల బ్రాంచ్ కార్యాలయంలో నూతన మేనేజ ర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనం తరం మాట్లాడుతూ కార్మిక క్షేత్రం ప్రజలు ఎస్‌బీఐ లైఫ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుఎంలు అలువాల శ్రీనివాస్‌యాదవ్, జక్కుల అన్వేష్‌యాదవ్, శివా నంద్,రంగు అనిత, ఆఫీసర్ క్లర్క్ ఉమేష్, క్లబ్ మెంబర్లు, ఎల్ఎంలు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

తెలంగాణ చౌక్, జూన్ 9: సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ కృష్ణ తెలి పారు. అతని వయస్సు సుమారు 45 నుంచి 55 ఏండ్ల మ ధ్య ఉంటుందని, ఒంటిపై నలుపు రంగు గీతల టీ షర్ట్, నలుపు రంగు నైట్ ప్యాంట్‌ను ధరిం చి ఉన్నాడ ని పేర్కొన్నారు. ఎడమ చేతిపై 'బుజ్జి' అ నే పేరుతో ప చ్చబొట్టు ఉన్నట్లు తెలియజేశారు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ దవాఖానలోని మా ర్చురీలో ఉంచామ ని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే తా ణాలో సంప్రదించాలన్నారు. 87126-56366, 87126-56367నంబర్లకు సమాచారం అందిం చాలని సూచించారు.

పరామర్శ

కోనరావుపేట, జూన్ 9: ఎగ్లాస్‌పూర్ గ్రామంలో ఇటీవల మాజీ కో ఆప్షన్ మెంబర్ మిస్కిన్ భాషా మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులను మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్, బీఆర్ఎస్ మండ లాధ్యక్షుడు మల్యాల దేవయ్య సోమవారం పరా మర్శించారు. ఇక్కడ జిల్లా నాయకులు మందాల శ్రీనివాస్, శివతేజరావు, యాస రాజం ఉన్నారు.

భూమి పూజ

ఇల్లంతకుంట, జూన్ 9: రేపాక గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇండ్ల నిర్మా ణానికి ఎంపీడీవో శశికళ సోమవారం ముగ్గు పోశారు. గూడు లేని నిరుపేదల సొంతింటి కల నెర వేరుతుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్ర మంలో హౌసింగ్ ఏఈ శ్రీజ, పంచాయతీ కార్యా దర్శి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ కాత సుమలత, నాయకులు గూడ బాబు, కాత మల్లేశం ఉన్నారు.

ప్రభుత్వ కాలేజీల్లో చేర్పించాలి

కోనరావుపేట, జూన్ 9: ఇంటర్మీడియట్ విద్యా ర్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ సూచిం చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు సోమవారం ఇంటింటా ప్రచారం చేయగా, ఆయన పాల్గొని, మాట్లాడారు. ఇక్కడ ప్రిన్సిపాల్ కేదారేశ్వర్, అధ్యాపకులు సుధాకర్, శ్రీనివాస్, ప్రసాద్, రమేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

పేరు మార్చబడినది

నేను ఉట్కూం పావని, పాస్‌పోర్ట్ నెం. S7771578 కలిగి ఉన్నాను. తెలంగాణలోని భూషన్‌రావుపేట్, మం|| కథలాపూర్, జి|| జగిత్యాల ఇ.నెం. 6-100లో నివసిస్తున్నా, పచిమట్ల శివకుమార్ భార్యని, వివాహం తర్వాత నా ఇంటి పేరును మార్చుకున్నానని మరియు ఇక పై అన్ని అధికారిక మరియు చట్టపరమైన ప్రయోజనాల కోసం పచిమట్ల పావని అని పిలువబడతానని ఇందు మూలంగా ప్రకటిస్తున్నాను. సంబంధిత పత్రాలన్ని ఈ మార్పును తదనుగుణంగా ప్రతిబింబిస్తాయి.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189